## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న విజయ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పలువురికి ఆదివారం మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నీలం సంజీవులు, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నీలం తిరుపతి, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

### చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని కాంగ్రెస్ నాయకులు వీరబోయిన గోపాల్, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డికి మంజూరైన రూ.40వేల చెక్కును ఆదివారం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఏపీగౌడ్, శ్రీనివాస్, అమరేందర్, రాజు, మోహిన్, కృష్ణ తదితరులున్నారు.

### జరిమానా



జరిమాన విధిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళ్తున్న వాహనాలు గురించి సాక్షి దినపత్రికలో శనివారం ' మట్టి, ఇసుక తరలింపుతో ఇక్కట్లు' కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన పోలీసులు ఆదివారం తూప్రాన్- నర్సాపూర్ హైవేపై వాహనాలు తనిఖీ చేపట్టారు. నిబంధనలకు పాటించకుండా రోడ్డు వెళ్తున్న పలు టిప్పర్ల ఆపి డ్రైవర్స్‌కు అవగాహన కల్పించి జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమించే వాహనాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి హెచ్చరించారు.

### భక్తులకు ముత్యాల తలంబ్రాలు



రామకోటి రామరాజుకు తలంబ్రాలను అందజేస్తున్న ఏఈఓ శ్రావణ్

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించిన ముత్యాల తలంబ్రాలను గజ్వేల్ ప్రాంత భక్తులకు పంపిణీ చేసేందుకు ఆ ఆలయ అధికారులు రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆ ఆలయ ఏఈఓ శ్రావణ్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో రామకోటి సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని, మూడేళ్లుగా తలంబ్రాలను గోటితో వలిచి అందించడం ఆనందంగా ఉందన్నారు. గజ్వేల్ ప్రాంత భక్తులకు అందించేందుకు 100 కిలోల తలంబ్రాలను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పోచమ్మతల్లి ఆలయ రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు బోనాల జాతర, మంగళహారతులతో సామూహిక పూజలు చేశారు. ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు.

# ఉత్సవాలకు వేళాయే..

**నేటి నుంచి సీతారామచంద్ర విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు**
- ముస్తాబైన రామాలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



పెద్దశంకరంపేటలో నూతనంగా నిర్మించిన రామాలయం

పెద్దశంకరంపేట(మెదక్): సీతారామచంద్రుల ప్రతిష్ఠ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన శ్రీ సీతారామచంద్రుల ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా పురాతన ఆలయాన్ని తొలగించి పునర్నిర్మాణం చేపట్టారు. ఉత్సవాలకు పలువురు స్వామిజీలు, టీటీడీ బోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం



ఆలయంలో సీతారామచంద్రుల విగ్రహాలు

ధ్వజారోహణం, గణపతిపూజ, స్వస్తిక్ రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, నవగ్రహ, యోగినీ, వాస్తు, క్షేత్రపాలక, కుటీరహోమం, జలాధివాసం, ప్రదోషకాల పూజ, మంత్రపుష్పం, తీర్థప్రసాదం, మంగళవారం గురువందనం, మంటప ఆవాహిత దేవతా పూజలు, బాలాలయంలో దేవతామూర్తుల కళాపకర్షణ, ధాన్యాదివాసం, లక్షపుష్పార్చన, శ్రీరామతారక మంత్రహవనం, బుధవారం ఆవాహిత దేవతా పూజలు, యంత్ర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం, మహా మంగళహారతి లాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంటికి ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తులు సాంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జరి కనకరాజు, కమిటీ సభ్యులు తెలిపారు.

**హాజరుకానున్న స్వామిజీలు, ప్రముఖులు**

ఈ కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి శ్రీగురు మాదవానంద సరస్వతి, శ్రీ హంపీ పీఠాధిపతి (విరూపాక్ష) శ్రీ విద్యారణ్య భారతీస్వామి, చిలుకూరు ఆలయ పూజారులు డాక్టర్ సీఎస్ రంగరాజన్‌తో పాటు తిరుమల తిరుపతి ఆలయ పాలక మండలి సభ్యులు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

# ఘనంగా ఈస్టర్ వేడుకలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఈస్టర్ పర్వదిన వేడుకలను భక్తులు జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక చర్చిలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ దేవవరం దైవ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ చార్లెస్ వాకర్, పద్మారావు, పాల్, భూమయ్య, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: సీఎస్‌ఐ చర్చిలో ఈస్టర్ సందర్భంగా చర్చి ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జి రెవరెండ్ సందీప్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఆదివారం తెల్లవారు జామున శిలువ ఆరాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం శిలువ చూట్టు మహిళలు క్యాండిల్స్ పట్టుకుని ప్రదర్శనలు చేస్తూ పాటలు పాడుతూ కొవ్వొత్తులు వెలిగించారు.



పెద్దశంకరంపేట సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్‌లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సీఎస్‌ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ జయపాల్ నాయక్ దైవ సందేశం వినిపించారు. అనంతరం క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల క్రైస్తవులు పాల్గొన్నారు.



సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

# అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నవీన్‌గుప్తా మండిపడ్డారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు సీసీ రోడ్లు, మురికికాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విషయం గుర్తు చేశారు. గత ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధామా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, అంజయ్య, గణేష్, ప్రభులింగంగౌడ్, మల్లేష్, గౌరిశంకర్, దావుద్, శ్రీనివాస్, మురళి, తదితరులు ఉన్నారు.

### చేతిపంపును తొలగించండి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం పరిధి బొమ్మారం గ్రామంలోని గాంధీచౌరస్తాలో ఉన్న చేతిపంపు నిరుపయోగంగా మారింది. భూగర్భజలాలు తగ్గిపోవడంతో చేతిపంపు నుంచి చుక్కనీరు రావడంలేదు. అయినా పంపును తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. ఏళ్ల తరబడి వినియోగించకపోవడంతో సగం మేర మట్టిలో కూరుకుపోయింది. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆ చేతిపంపును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

# కుక్కలతో అప్రమత్తం



చేగుంటలోని సీఎంఆర్ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

**పెరుగుతున్న దాడులు**

వేసవిలో కుక్కలు ఎక్కువగా జనాలపై దాడిచేస్తాయి. కరవడం, గాయపర్చడం వంటి సంఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మండల కేంద్రమైన చేగుంటలోనే రెండు నెలల కాలంలో 20 మందిని కుక్కలు కరిచిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కుక్కలు కరిస్తే రేబిస్ వచ్చే అవకాశం ఉంటుంది. కుక్క కరిచిన అనంవతరం ఎప్పుడైనా రేబిస్ లక్షణాలు బయట పడతాయి. ఆ వ్యాధి ముదిరితే ప్రాణాంతకంగా మారుతుంది. కుక్కలు కరిచిన వెంటనే గాయాలను లిక్విడ్ సోప్‌తో శుభ్రపరిచాలని, పరిశుభ్రమైన వస్త్రంతో గాయాలను కప్పేసి వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు.

– చేగుంట(తూప్రాన్)

**ఇంజక్షన్లు తప్పనిసరి**



ఇటీవల చేగుంటలో కుక్కలు దాడులు పెరిగాయి. కుక్కలు కరిచిన వ్యక్తులు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా రేబిస్ నివారణ వ్యాక్సిన్ వేయించుకోవాలి. రేబిస్ వ్యాక్సిన్ కుక్క కరిచిన రోజున ఒకటి, మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 30వ రోజున ఐదు డోసుల్లో వేయించుకోవాలి. అలా చేస్తే వ్యాధి బారినపడకుండా ఉండొచ్చు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ నివారణ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, చేగుంట

# కొనుగోలు కేంద్రాలతో లబ్ధి

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఉసిరికపల్లి, కొంతన్‌పల్లి, పెద్దగొట్టిముక్ల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణారావు, వీరేశ్, శ్రీనివాస్, నవీన్‌గుప్తా, షెక్అలీ, సత్తయ్య, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

### నేడు పోషణ్ పక్వాడ కార్యక్రమం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ తెలిపారు. చిన్నశంకరంపేట ఐకేపీ కార్యక్రమానికి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌తో పాటు మండలంలోని అధికారులు హాజరవుతారని చెప్పారు.

### అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచ్ మృతి



శ్రీనివాస్‌గౌడ్

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్‌గౌడ్(46) అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స అనంతరం కోలుకున్నారు. శనివారం అర్ధరాత్రి ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### బీఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలోని పేద ప్రజలు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందిండటం, అలాగే క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా మండలంలో ఎవరైనా నిరుపేదలు మరణిస్తే వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడం గొప్పవిషయమని కొనియాడారు. భవిష్యత్‌లో ఫౌండేషన్ సేవలు మరింత ఎక్కువ మందికి అందేలా చూడలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కిషన్, మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, శ్రీధర్, నర్సింహులు, స్వామి, వంశీధర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లిలోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

# ఆత్మరక్షణకు కరాటే దోహదం



విజేతలతో ఎస్‌ఐ కరాటే మాస్టర్లు

నర్సాపూర్: కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని ఎస్‌ఐ లింగం పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో రెంజుకి షూటోకాన్ కరాటే పరీక్షల్లో విజేతలకు బెల్టుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని బెల్టులు అందచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే ఎగ్జామినర్లుగా మాస్టర్ నగేష్, అశోక్, సత్యనారాయణ, నరసింహ, ప్రసన్నలు పాల్గొన్నారు. పోటీల్లో నర్సాపూర్, అన్నారం, రుస్తుంపేట, కొడిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 80మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

# ఉన్నత చదువులతోనే గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు యాదగిరి

శివ్వంపేట(నర్సాపూర్): 59 ఉపకులాల బహుజన విద్యార్థులందరూ ఉన్నత చదువులు చదువుకున్నప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. అదివారం మండల పరిధి దంతన్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి గ్రామ నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యతతో ముందుకు వెళ్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ కమిటీలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు లింగం, తదితరులు పాల్గొన్నారు.

### జీపీకి ట్రాలీ అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్ గ్రామంలో చెత్తసేకరణకు గ్రామవాసి హైకోర్టు న్యాయవాది రమాదేవి శివకుమార్‌గౌడ్ దంపతులు టాక్టర్ ట్రాలీ అందజేశారు. చిన్న పంచాయతీ కావడంతో నిధులు లేక చెత్తసేకరణకు ఇబ్బందులు పడుతున్న విషయం గురించి మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీ శివకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో లక్ష 50 వేల రూపాయల సొంత నిధులతో ట్రాలీ తయారు చేయించి ఆదివారం గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.



జీపీకి అందజేసిన ట్రాలీ

# ‘వక్ఫ్’పై బీఆర్ఎస్ వైఖరి ప్రకటించాలి

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వక్ఫ్ సవరణ చట్టంపై బీఆర్ఎస్ వైఖరి ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టంపై బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంటుందో తెలపాలన్నారు. దేశంలో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు అందించిన 4 శాతం రిజర్వేషన్ ఇప్పటికీ అమలు అవుతోందని చెప్పారు. కేవలం ఎన్నికలప్పుడు ముస్లింల ఓట్లు దండుకునేందుకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ పదేళ్ల పాటు కాలయాపన చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ ముస్లింలపై ప్రేమ కురిపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీజేపీ తీసుకున్న ప్రతి నిర్ణయంలో బీఆర్ఎస్ సహకరిస్తోందని, ఆ రెండు పార్టీలు తోడుదొంగలేనని ప్రజలకు అర్థమైందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, మైనార్టీలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయాజొద్దీన్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం, ఫయాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

# నూతనోత్సాహం నింపిన వేడుకలు

- డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా జెడ్పీహైస్కూల్ వార్షికోత్సవం

వర్గల్(గజ్వేల్): ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు అందరిలో నూతనోత్సాహం నింపాయని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించిన స్థానిక జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాంగ్రా, లంబాడి, హర్యాన, కేరళ నృత్యాలు జాతీయ సమైక్యతను చాటాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ఉపాధ్యాయులు సమర్థవంతంగా వినియోగించుకున్నపుడే అద్భుత ఫలితాలొస్తాయన్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా వర్గల్ స్కూల్‌కు అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, వొకేషనల్ కోర్సులు, ఆధునిక వసతులు సమకూరాయని చెప్పారు. పాఠశాల రూపొందించిన ఈ–మేగజైన్, త్రైమాసిక ఆన్‌లైన్ ప్రగతి పుస్తకం ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సూర్యరాజు, అమర్‌నాథ్, ఏఎంసీ చైర్మన్ భవాని తదితరులు పాల్గొన్నారు.




‘నో డ్రగ్స్’ బాలుర సందేశాత్మక ప్రదర్శన